ప్రజాశక్తి
ఆదివారం 13 ఆగస్టు 2023




విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన రైతు పెందుర్తి సూర్యనారాయణ (60) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూర్యనారాయణ తన పొలంలో పురుగుమందు పిచికారీ చెయ్యడానికి శనివారం వెళ్లాడు. ఈ నేపథ్యంలో పొలానికి నీరు వదలడానికి మోటారు స్విచ్ వేస్తుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికులు చికిత్స కోసం మిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ పి.నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సూర్య నారాయణ

ఎం.సీతారాంపురం వద్ద వరి నాట్లకు నోచుకోని భూములు



- తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా శివారు భూములకు అందని సాగునీరు
- నేటికీ వరి నాట్లు వేయని పరిస్థితి
- ఎండిపోతున్న ఎద వరి మడులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

సాగు కష్టమే!

ప్రజాశక్తి- వంగర

రాత్రనకా పగలనకా అహర్నిశలూ ఎన్నో ఇబ్బందులు పడి, పంటలు పండిస్తున్న రైతులకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. సకాలంలో నీరందకపోవడంతో వరి పంటలు వేయలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో నేటికీ మండలంలోని వివిధ గ్రామాలలో వరి నాట్లు వేయలేదు. నీరందక మరోవైపు ఎదలు జల్లిన వరిచేలు ఎండిపోతుండడంతో ఆవేదన చెందుతున్నారు.

తోటపల్లి కుడి ప్రధాన కాలువకు వంగర మండలంలోని శివ్వాం, తలగాం, వంగర, ఎం సీతారాంపురం, గ్రామాలు శివారున ఉన్నాయి. ఆయా గ్రామాలలో ప్రధానంగా వరి విస్తీర్ణం సుమారు 1500 ఎకరాల వరకు ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న నేటికీ ఆయా గ్రామాల పొలాలకు తోటపల్లి కుడి కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ వర్షపాతం నమోదు

ముఖ్యంగా ఈ ఏడాది జిల్లాలోనే వంగర మండలంలో అత్యంత తక్కువ వర్ష పాతం నమోదైంది. కనీసం చెరువుల్లో కూడా నీరు లేకపోవడంతో శివ్వాం, ఎం సీతారాంపురం, వంగర, తలగాం, గ్రామాలలో రైతులు వరి నాట్లు వేయలేదు. చాలామంది రైతులు ఈ ఏడాది ఎదలు జల్లారు. అయితే అవి కూడా నీరు లేక ఎండిపోతున్నాయి. కొంతమంది రైతులు వద్ద సాగునీటి విద్యుత్ మోటర్లు ఉండడంతో ఎక్కువ కష్టపడి కొంతమేర వరినాట్లు వేస్తున్నప్పటికీ మోటార్లు కూడా మొరాయిస్తున్నాయని ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. మిగిలిన వారంతా దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. దాదాపు ఏటా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడు ఎవరూ లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగానే సాగునీటి కాలువలు

తోటపల్లి కుడి కాలువ ద్వారా మండలానికి సాగునీరు అందించవలసి ఉంది. ప్రాజెక్టు వద్ద కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసినప్పటికీ ప్రస్తుతం కాలువల పరిస్థితి చాలా అధ్వానంగా ఉన్నాయి. కాలువలు బలహీనంగా ఉండటంతో పాటు ముల్లు పొదలు, గడ్డి, మట్టి, చెత్త చెదారాలతో నిండి పోవడంతో సాగునీటికి మరింత జాప్యం జరుగుతుంది. దీంతో శివారు భూములకు నీరందడం లేదు.

పట్టించుకోని అధికారులు

తోటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువకు శివారు గ్రామాలైన శివ్వాం, ఎం సీతారాంపురం, వంగర, తలగాం తదితర గ్రామాలకు ఏటా సాగునీరు అందటం లేదు. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు. సాగునీటి కాలువలు సక్రంగా లేకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

రెండు రోజుల్లో సాగునీరు అందిస్తాం

శివారు భూములకు సాగునీరు అందని విషయం వాస్తవమే. మండలంలోని కొత్తవలస వద్ద ఉన్న ఎస్ఎస్ ఛానెల్ బాగులేనందువల్ల ఈ ఏడాది శివారు భూములకు ఇంతవరకు సాగునీరు అందించలేకపోయాం. రెండు రోజుల్లో సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

దేవర వెంకటరమణ, తోటపల్లి కుడికాలువ ఎఇ.

ఇబ్బందులు పడుతున్నాం



సాగునీటి కాలువకు పక్కనే మా పొలం ఉంది. అయినప్పటికీ సాగునీటి కాలువ ద్వారా నీరు రాకపోవడంతో నేటి వరకు వరి నాట్లు వేయలేకపోయాం. ఈ విషయం సంబంధించిన అధికారులకు చెబుతామన్న వారు ఎక్కడా కనిపించే పరిస్థితి లేదు. పొలాల వైపు కాలువకు సంబంధించిన అధికారులు ఎవరూ రావడం లేదు.

రుంకు శ్రీనివాసరావు, రైతు, ఎం సీతారాంపురం.

పట్టించుకోవటం లేదు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇన్నాళ్ళు గడుస్తున్న నేటి వరకు సాగునీరు అందలేదు. ఏటా ఇదే తంతు జరుగుతుంది. ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలి.

దేవకవాడ అప్పలనాయుడు, రైతు, వంగర.



ఉపాధ్యాయుల నిరసన దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు

విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు
- ఉపాధ్యాయుల 12 గంటల నిరసన
- ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కారం కోసం ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం కలెక్టరేట్ ఎదుట 12 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఈ దీక్ష సాయంత్రం 7గంటల వరకు కొనసాగింది. ఈ నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, పట్టభద్రుల ఎమ్మెల్సీ వి.చిరంజీవులు మద్దతు తెలిపారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల మొదటి గంట నుండి చివరి బెల్ వరకు ఉపాధ్యాయులకు యాప్‌ల నిర్వహణ, బోధనేతర పనులతో బోధనకు దూరం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 ప్రభావం వల్ల 1442 పాఠశాలలు సింగల్ టీచర్ స్కూల్స్‌గా మారాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో 117 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల, ప్రమోషన్లు పొందిన హెచ్‌ఎంల వేతనాలు చెలించకపోవడం సరి కాదన్నారు. తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కలెక్టరేట్ ఆవరణలో భోజనాలు చేస్తున్న ఉపాధ్యాయులు




ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వి.చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని తెలిపారు. ఫ్యాప్టో జిల్లా నాయకులు సిహెచ్ వెంకటరమణ, జె. రమేష్ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని, పిఎఫ్, ఎపిజిఎల్ఐసి, ఆర్జిత సెలవులు, మెడికల్ బిల్లుల నగదు బకాయిలు చెల్లించాలని, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.శ్యామ్, పి.శ్రీనివాస్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, వై. అప్పారావు, డి. ఈశ్వరరావు. ఎస్ కె. బుకారిబాబు, సిహెచ్ రాము, అధిక సంఖ్యలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గిరిజన భూములకు రక్షణ కల్పించండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెంటాడ మండలం ఆగూరు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 239 నుంచి 242లో గల 70 ఎకరాల భూమిని 79 కుటుంబాలు చాలాకాలంగా సాగు చేసి జీవిస్తున్నారని, ఆ భూములను కొందరు భూస్వాములు ఆక్రమిస్తున్నందున గిరిజనులు భూములకు రక్షణ కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, రాకోటి రాములు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావును కోరారు. శనివారం చైర్మన్‌ను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం గుడ్డివలస, కిందగూడెం అనే పేరుతో గ్రామాలను ఏర్పాటు చేసుకుని ఆకొండ ప్రాంతంలో సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని, వారి భూములపై పెద్దల కన్ను పడిందని తెలిపారు. వేరే గ్రామస్తుల పేరు మీద రికార్డులు సృష్టించి వారే భూమిని తనకు అమ్మినట్లుగా రికార్డులు చూపించి బండారు సంజీవరావు వ్యక్తి ఆక్రమిస్తున్నాడని తెలిపారు. రెవెన్యూ అధికారులను సైతం ప్రలోభాలకు గురి చేసి రికార్డులను తారుమారు చేశాడని తెలిపారు. పలుమార్లు అధికారులకు, ఉపముఖ్యమంత్రి రాజన్న దొర వినతులు అందజేసినా ఇంతవరకు చర్యలు లేవని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు గానీ రెవెన్యూ అధికారులు కానీ ఉమ్మడిగా ఆ భూమిని



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిస్తున్న నాయకులు

సర్వే చేసి ఫారెస్ట్ భూమిగా గాని రెవెన్యూ భూమిగా గాని తేల్చి చెప్పకపోవడంతోపాటు పట్టాలు కూడా మంజూరు చేయలేదన్నారు. తక్షణమే ఈ భూమిని గిరిజనులకు దక్కే విధంగా హక్కులు కల్పించాలని కోరారు. చైర్మన్ స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చైర్మన్‌కు గిరిజన సంఘాల అభినందనలు

చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావును పలు గిరిజన సంఘాలు, గిరిజనులు కలిసి అభినందనలు తెలిపారు. వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ఏ సమస్యనైనా ఆధారాలతో నేరుగా గాని, ఫోన్ ద్వారా గాని తెలియ జేయవచ్చునని తెలిపారు.

గుండు కొట్టించుకునేందుకు సిద్ధంగా ఉండండి

బొత్స వ్యాఖ్యలపై టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి -విజయనగరం కోట

తీవ్ర అసహనంతో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ ఏవేవో మాట్లాడుతున్నారని టిడిపి విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. ఉగాది తరువాత టిడిపి, జనసేన ఉంటే గుండు కొట్టించుకుంటానని బొత్స అనే మాటలకు కట్టుబడి అందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 40 ఏళ్లగా ప్రజా సేవకు అంకితమైన పనిచేస్తోందని, రాబోయే వందేళ్లకు పైగా తెలుగు ప్రజల కోసం ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను స్వాగతించిన నాగార్జున, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి కావడం తథ్యమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఒడించారు.బొత్స మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి బొత్స సత్యనాఆరయణ



వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఎస్. పల్లవి, బి.హారికలను, కోచ్ చల్లా రామును శనివారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాలకు చెందిన పల్లవి ఇటీవల జరిగిన ఏషియన్, కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు, వెండి పతకాలు సాధించింది. కొండ వెలగాడకు చెందిన బి.హారిక కామన్ వెల్త్‌లో బంగారు పతకం, ఏషియన్‌లో కాంస్య పతకం సాధించింది. ఈనేపథ్యంలో ఎంతో అంకితభావంతో సాధన చేసి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తు లో ఇంకా ఎన్నో పతకాలు అంతర్జాతీయ స్థాయిలో తీసుకొని రావాలని కోరారు.

ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన క్రీడాకారులకు అభినందన

క్రీడా కోటాలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీట్లు సంపాదించిన ఫెన్సింగ్ క్రీడాకారులు పి.సాయి తారక హర్ష, సిహెచ్ సాయి పల్లవిను మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. శనివారం కోచ్ డివి చారి ప్రసాద్ విద్యార్థులను తీసుకొని మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి : కోలగట్ల

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరువ కావడంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రభుత్వంలో కీలకమైన వారి సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 21, 22వ తేదీల్లో విజయవాడ వేదికగా జరగనున్న ఎపి నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 21వ రాష్ట్ర మహాసభలకు విచ్చేయాలని కోలగట్లకు ఆ సంఘ నాయకులు శనివారం ఆహ్వానం పలికారు. తొలుత ఉప సభాపతి చేతుల మీదుగా మహా సభలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య వారధిలా ఉద్యోగ సంఘ నాయకులు పని చేస్తున్నారని ప్రశంసించారు. వారికి ఏ సహాయం కావాలన్నా తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డివి రమణ, జిల్లా అధ్యక్షుడు జె.మురళి, కార్యదర్శి ఎ.సురేష్, కోశాధికారి సుధాకర్, ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి



అర్హులందరికీ పథకాలు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం నగరంలోని 25వ డివిజన్ రంగాలవీధి రామ మందిరం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు, వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కుశల ప్రశ్నలు వేస్తూ ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైకసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో అన్ని ప్రాంతాలు గతానికి భిన్నంగా మారుతున్నా యన్నారు. ప్రధాన జంక్షన్లను అభివద్ధి చేయడమే కాకుండా ఎన్నో ఏళ్లనాటి సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. వైసిపి నాయకులు యడ్ల రాజేష్ మాట్లాడుతూ కోలగట్లను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆడారి రుక్మిణి, జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్ లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో రహదారులు , కాలువల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధికి కోలగట్ల వీరభద్ర స్వామి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యమ్రంలో కార్పొరేటర్ కంటుభుక్త తవిటి రాజు, వైసిపి నాయకులు కృష్ణమూర్తి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవం, అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరిగాయి. లైబ్రరీ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, హెచ్ఎస్ విభాగాల అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పలువురు లైబ్రేరియన్‌లు, సీతమ్ లోని విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రరీ సైన్స్ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ లైబ్రరీ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎయు డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ జి. ప్రభాకర్ అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సామాజిక బాధ్యత తదితర వాటిపై అవగాహన కల్పించడమే ఈ జాతీయ యువజన దినోత్సవం ప్రధాన ఉద్దేశమనితెలిపారు. అనంతరం కళాశాల లైబ్రేరియన్లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



లైబ్రేరియన్లను సన్మానిస్తున్న శశిభూషణరావు తదితరులు

విద్యార్థుల ఆవేదన వినిపించుకునేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చదువుతూ పోరాడు... చదువుకై పోరాడు అన్న నినాదంతో సాగిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర జిల్లాలో పది రోజుల పాటు సాగింది. గత నెల 31న ప్రారంభమైన యాత్ర 9వ తేదీ వరకు జిల్లాను చుట్టుముట్టింది. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో అనేక సమస్యలను ఎస్ఎఫ్ఐ బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలకు విద్యార్థులు అఖండ స్వాగతం పలికారు. రోజూ వేలాది మంది యాత్రలో భాగస్వామ్యమవుతూ తమ సమస్యలను నాయకుల ఎదుట ఏకరువుపెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. యాత్ర చివరి రోజు ఈనె 9వ తేదీన జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యాత్రలో గుర్తించిన సమస్యలను, విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం, ముఖ్యంగా జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కూడా రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనికితోడు ఆరు నెలలుగా ఛార్జీలు చెల్లించకపోవడంతో నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందుల నడుమ నెట్టుకొస్తున్నారు. చాలా చోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్లు నడుస్తున్నాయి. దీంతో, విద్యార్థులు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోలేదు. ప్రతి వార్డెన్ 2 నుంచి 3 హాస్టళ్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించడంతో విద్యార్థుల ఆలన పాలన, భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు అన్ని జూనియర్ కాలేజీల్లోనూ అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేరు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. గతంలోవున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని



ప్రభుత్వం తొలగించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాడు-నేడు నిధులు ఎటు పోతున్నాయో అంటూ జనంలో చర్చ నడుస్తోంది. అధ్యాపకులు, పాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో లేకుండా చదువులెలా సాగుతాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దత్తిరాజేరు, మెరకముడిదాంలలో రెండేళ్ల క్రితం మంజూరు చేసిన జూనియర్ కాలేజీలకు ఇప్పటికే సొంత భవనాలు లేవు. అధ్యాపకులు అరకొరగానే ఉన్నారు. దీంతో, హాస్టళ్ల మాదిరిగానే మరుగుదొడ్లు, తాగునీటి సమస్య వెంటాడుతోంది. భోగాపురం, మెంటాడ, బొండపల్లిలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా ఎస్.కోట మండలం బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని కొన్ని భవనాలు తొలగించిన సంగతి తెలిసిందే. వాటికి సంబంధించి కొత్తగా నిర్మాణణాలు చేపట్టకపోవడంతో ఉన్నత కొద్దిపాటి గదుల్లోనే విద్యార్థులకు షిఫ్టులవారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్.కోట, గజపతినగరం డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలు లేకపోవడంతో కనీస సదుపాయాలు కూడా గగన మయ్యాయి. అధ్యాపకులు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురౌతున్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్శిటీకీ కూడా సొంత భవనం లేకపోవడం వల్ల తరగతులు ఒకచోట, ప్రయోగాలు మరోచోట, హాస్టల్ ఇంకోచోట నడుస్తున్నాయి. దీనికితోడు జిల్లాలో పిజి క్యాంపస్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేకపోవడం పట్ల యాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు విస్తుపోయారు. మెజార్టీ హాస్టళ్లు, స్కూళ్లు, కాలేజీలలో కనీస సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యాయులు, అద్యాపకులు సరిపడినంత మంది లేకపోవడంతో నాడు - నేడు నిధులు ఏమౌతున్నాయో అన్న అనుమానాలు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులల్లో వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా అధికారులు కల్లు తెరిచి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరుతున్నారు. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కరుణించని వరుణుడు

● రైతులకు అందని విఆర్‌ఎస్ కాలువ నీరు ● ఎండిపోతున్న వరినారు ● ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో వరుణుడి కరుణించకపోవడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరినాట్లు ఎండిపోతున్నాయి. దీంతో ఏం చేయాలో రైతులకు పాలు పోవడం లేదు. రెండు వారాలుగా వర్షం లేక వెంగళరాయ సాగర్ కాలువ నీరు అందకపోవడంతో ఖరీఫ్ సాగు కోసం రైతులు వేసిన వరినారు ఎండిపోతుంది. రైతులకు సంపూర్ణంగా సాగునీరు అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. వెంగళరాయసాగర్ ప్రాజెక్టు నీటిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కలిసి విడుదల చేసి రెండు వారాలు కావస్తున్నా బొబ్బిలి ప్రాంత రైతులకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు వేసిన వరినారు ఎండిపోతుంది. అధికార యంత్రాంగం స్పందించి సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


బొబ్బిలి: ఎండిపోయిన వరి నారును చూపిస్తున్న రైతు

వెంగళరాయసాగం కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. వెంగళరాయసాగర్ ప్రాజెక్టు నుంచి బొబ్బిలి మండలంలోని బొడ్డవలస, వెలగవలస, నారసింహునిపేట, దిబ్బగుడివలస, పాతబొబ్బిలి, మల్లమ్మ పేట, జగన్నాథపురం, కోమటిపల్లి, లింగాలవలస, తదితర గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. అధికారులు స్పందించి సాగునీటి కాలువలో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించి సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎండిపోతున్న వరినారు

ఒకపక్క వర్షాభావ పరిస్థితులు, మరోపక్క విఆర్‌ఎస్ కాలువ నీరు పంట పొలాలకు అందకపోవడంతో రైతులు వేసిన వరినారు ఎండిపోతుంది. రెండు వారాలు నుంచి వర్షాలు లేకపోవడంతో పాటు సాగునీటి కాలువ నీరు అందకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.సాగునీరు అందేలా చూడాలని అధికారులను రైతులు కోరుతున్నారు.


వేపాడ: మదుము వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

30 ఎకరాలకు తప్పని సాగునీటి కష్టం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో సోంపురం జంక్షన్ నుండి ఆనందపురం వరకూ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో బక్కునాయుడుపేట వద్ద చెరువు నుంచి పొలానికి నీరు వెళ్లే మధుములను ఎత్తుగా నిర్మించేశారు. చెరువు కన్నా మదుములు ఎత్తుగా ఉండటం వల్ల సుమారు 30 ఎకరాలకు సాగు నీరు వెళ్లడం ప్రశ్నార్థకంగా మారింది. కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు దోరణి వల్లే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎత్తుగా నిర్మించిన మదుమును సాగునీరు వెళ్లే స్థాయిలో నిర్మించి తమకు అప్పగించాలని సింగవరం, బానాది, బక్కునాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులు దేవుడు, డి మాణిక్యం, డి.రాము, డి. అప్పారావు, ఎం. నాగేశ్వరరావు, టి. శీను, ఎస్ మదిన్, ఎస్ రాము, కేప నాయుడు, ఎం. అప్పన్న దొర, టి.చెల్లయమ్మ, జి. దేవుడు, రమణ, జగన్ శనివారం మధుము వద్ద డిమాండ్ చేశారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కొండపల్లి కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- గంట్యాడ

దివంగత ఎంపి కొండపల్లి పైడితల్లి నాయుడు సతీమణి చిన్నప్పయ్యమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం కొండపల్లి కుటుంబీకులను గంట్యాడలో పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఎంపి బెల్లాన్ని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. మంత్రి వెంట ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సింగరాయిలో 'నా భూమి- నా దేశం'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం ఆవరణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాభూమి-నాదేశం నేల తల్లికి నమస్కారం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్ వెంకటరావు, ఈ కార్యదర్శి కన్నంనాయుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.


ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

ఉపఎన్నిక ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని రొంపల్లి పంచాయతీలో 7వ వార్డు మెంబర్ ఎన్నిక కోసం జరిగే ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు సహకరించాలని సిఐ తిరుమలరావు సూచించారు. శనివారం స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడుతో కలిసి ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి ఎన్నిక విధి విధానాలు వివరించారు. మెంబర్ ఎన్నికల్లో ఎటువంటి అపశ్రుతులకు చోటివ్వకుండా మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు, ఎంపిటిసి భవిరెడ్డి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి నాయకుడు మృతి


మృతి చెందిన వెంకటరావు

ప్రజాశక్తి - కొత్తవలస

బిఎస్‌పి ఎస్‌కోట నియోజకవర్గం అధ్యక్షులు కోట వెంకటరావు అనారోగ్యంతో మృతి చెందాడు. గత వారం రోజులుగా విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం ఆయన స్వగ్రామం అలమండలో ఉంచి ఆయన పార్థివ దేహాన్ని బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోము రాంబాబు, పీరుబిండి ప్రకాష్‌రావు, జిల్లా అధ్యక్షులు కొమ్ము సోములు, విజయనగరం, నెల్లిమర్ల అసెంబ్లీల అధ్యక్షులు అర్జీ పైడిరాజు, ఏరుకొండ వెంకట్రావు, నాయకులు గాలి చైతన్యకుమార్, కాకర శ్రీనివాసరావు, బోని రాంబాబు, ఘన నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియల్లో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు బోని కృష్ణ, మహిళా అధ్యక్షురాలు పెద్దాడ కనకమహాలక్ష్మి, రాజు, సత్తిబాబు, ధోని అప్పారావు, మల్లయ్య, మువ్వల రమణ, జుత్తాడ, పాండ్రంకి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణరావును సత్కరిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

ఉత్తమ లైబ్రేరియన్‌గా లక్ష్మణరావు

విజయనగరం కోట : స్థానిక గాజులరేగ శాఖ లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావుకు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డును రాష్ట్ర గ్రంథాలయ కమిటీ సభ్యులు అందజేశారు. శనివారం గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా లైబ్రరీ సైన్స్ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి నేపథ్యంలో ఈయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, అబ్దుల్ రవూఫ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి

కొమరాడ : డెంగీ జ్వరం బారినపడి ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుమ్మరి గుంటకు చెందిన గనేడ ధరణి (11) డెంగీ జ్వరంతో గత వారం రోజులుగా శ్రీకాకుళం జిల్లా జిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. జ్వరం రావడంతో పార్వతీపురంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం శ్రీకాకుళంలోని జిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కొద్దిరోజులుగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ పరిస్థితి విషమించడంతో విద్యార్థిని మృతి చెందింది.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన పత్తి గుల్ల వరుణ్(9) ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం స్నేహితులతో కలిసి బహిర్భూమికి వెళ్లిన క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన ఊపిరితో ఉన్న బాలుడిని గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి పత్తి గుల్ల తవుడు, రవణమ్మ దంపతులకు వరుణ్ చిన్న కుమారుడు. మూడవ తరగతి చదువుతున్నాడు. ఊహించని ఈ సంఘటనతో కుటుంబంలోనూ, గ్రామంలోనూ విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వరుణ్ (ఫైల్)

గ్రామాల్లో విద్యుత్తు కో(వా)త

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం 6గంటలు దాటితే ఈఎల్ఆర్ పేరుతో విద్యుత్తు కోతలతో ప్రజలకు వాతలు పెడుతున్నారు. ప్రతి రోజు రాత్రి సమయంలో సుమారు ఐదు గంటలపాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ కరెంటు ఇవ్వకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు అవస్థలు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో అడపాదడపా వర్షాలు పడినప్పటికీ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటంతో రాత్రి సమయాల్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంట్లో పడకుందామంటే ఉక్కబోత, బయట పడుకుందామంటే దోమల మోతతో చంటి పిల్లలు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కోతలు నివారించాలి

నెల్లిమర్ల : నగర పంచాయతిలో విద్యుత్ కోతలు నివారించాలని సిఐటియు మండల నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విద్యుత్ కోతలు నివారించాలని కోరుతూ సబ్ స్టేషన్ ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నెల్లిమర్ల, జరజాపుపేట పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రాత్రిపూట విద్యుత్ కోతలు వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు, కూలీలు, కూలీ పని చేసుకున్న వాళ్ళు పగలంతా కష్టపడి రాత్రి ఇంటికి వచ్చే సమయంలో 7గంటల నుంచి


నెల్లిమర్ల: ఎఇకి వినతి పత్రాన్నిస్తున్న రామారావు

కారణం లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో విద్యుత్ రాకకోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు దోమకాటు గురై వ్యాధుల బారినపడి పడుతున్నారన్నారు. కాగా యూనిట్‌కి 80 పైసలు చొప్పున పెంచినా ఈ కోతలేంటని ప్రశ్నించారు. విద్యుత్ కోతలు ఇలాగే కొనసాగితే నెల్లిమర్ల, జరజాపుపేట ప్రజలు కరెంటు బిల్లు కట్టకుండా నిరసన వ్యక్తం చేస్తారని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో నగర పంచాయతీ బాధ్యులు కె. సూర్య నారాయణ ఉన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

ప్రజాశక్తి - వంగర

మండలంలోని రుషింగి గ్రామ వాలీబాల్ క్రీడాకారులకు జనసేన నాయకులు శనివారం వాలీబాల్ కిట్‌లు అందజేశారు. తాము అడిగిన వెంటనే స్పందించి వాలీబాల్ కిట్ అందజేయడంతో రుషింగి గ్రామ యువకులంతా హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు సాదేం రమేష్, తూముల యోగేంద్ర, యలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు వాలిబాల్ అందిస్తున్న నాయకులు

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

సేవ్ ఇండియా సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో సిపిఐ రాష్ట్ర సమితి తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఖండాపు ప్రసాదరావు కోరారు. ఆయన అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలతో శనివారం చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధనకై సిపిఐ పార్టీ ఈనెల 17వ తేదీన తలపెట్టిన బస్సు యాత్ర కార్యక్రమానికి తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి ఎక్కువైందని ఉన్న ప్రాజెక్టులకు కనీస మరమ్మత్తులు చేయడానికి కూడా ఈ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ మువ్వల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు శంకర్రావు, ఎస్‌టియు నాయకులు జెసి రాజు, ఐఎఫ్‌టియు నాయకులు మెరుగాని గోపాలం, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ మహాజన, సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొద్దాన అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, పికెఎస్ జిల్లా అధ్యక్షులు తమటాల అప్పలనాయుడు, ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసపు సాయికిరణ్ యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలని ఆందోళన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో బానాది గ్రామంలోని గొంపవారి వీధిలో తాగునీటి కష్టాలు తీర్చాలని మహిళలు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి గొంప తులసి, వార్డు మెంబరు గొంప దేవుడు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా తాగునీటి సమస్య తమను వేధిస్తోందన్నారు. తమ వీధిలో కుళాయిలు పనిచేయకపోవడంతో పక్క వీధికి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ దేవి దృష్టికి, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్యను పరిష్కరించలేదని అందుకే ఆందోళనకు దిగామని స్పష్టం చేశారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శిని వివరణ అడగ్గా తాను సమస్యను సర్పంచ్ దృష్టిలో పెట్టానని త్వరలో సమస్య పరిష్కరిస్తామని ఆయన చెప్పారని అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ దేవిని వివరణ కోరగా నిధులు మంజూరు కాగానే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వీధిలో తాగునీటి, పారిశుధ్యం సమస్య వారం రోజుల్లో పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గొంప వెంకటరమణ, గుమ్మడి రాంబాబు, మహిళలు పాల్గొన్నారు.


జెండాలను విక్రయిస్తున్న బ్రాంచ్ మేనేజర్ ఇజ్రాయిల్

జాతీయ జెండాలు విక్రయం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని గంట్యాడ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జాతీయ జెండాలను విక్రయిస్తున్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జెండాలను విక్రయించాలని ఆదేశాలు మేరకు బ్రాంచ్ ఆఫీసులలో అమ్ముతున్నట్లు బ్రాంచ్ మేనేజర్ వై ఇజ్రాయిల్ శనివారం తెలిపారు. మండలంలోని 13 బ్రాంచ్‌లలో 750 జెండాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక్కో జెండాను రూ. 25కు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

నిత్యం పని ఒత్తిడి, ప్రజా సేవలో ఉండే రెవెన్యూ శాఖ ఉద్యోగులకు 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురష్కరించుకుని శనివారం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు, స్టాఫ్, ఎన్నికలు, సివిల్ సప్లై, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి పలు క్రీడా పోటీలను నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్, పాటల పోటీలను నిర్వహించగా పురుషులకు క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు పారాది స్కూల్ పిఇటి, మహారాజ కాలేజీ పిఇటిలు సహాయ సహకారం అందించారు. తహశీల్దార్ రాజేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొన్నారు.


క్రీడల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

భూములను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - వేపాడ

ప్రజాశక్తి కథనానికి స్పందన

మండలంలో వీలుపర్తి రెవెన్యూ పరిధిలో భూములను తహశీల్దార్ ప్రసన్నకుమార్ పరిశీలించారు. 'లీజు పేరిట మోసం' రైతు భూములను రియల్ వ్యాపారులకు ఇచ్చేందుకు ప్రయత్నం, స్వాధీనం చేసుకున్న రైతులు అనే శీర్షిక పేరిట శనివారం ప్రజాశక్తి దిన పత్రికలో వెలువడిన కథనానికి ఆర్‌డిఒ స్పందించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. దీంతో ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో పాల్గొన్న రైతులు తమ భూములను తామే సాగు బాగు చేసుకుంటున్నామని, కోర్టు వివాదంలో తమ భూములు లేవని తహశీల్దార్‌కు చెప్పారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నివేదికను అధికారులకు పంపిస్తామని ఆయన రైతులకు వివరించారు.


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసన్నకుమార్

ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని పలు విద్యాసంస్థలు, వసతి గృహాల్లో శనివారం ఎఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైకలి విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ అని అన్నారు. స్వాతంత్రం మా జన్మహక్కు' అని భారతజాతి ఎలుగెత్తి నినదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ మనీ, నందిని, భారతి, డివిజన్ నాయకులు హరికృష్ణ, పోలిరాజు, దుర్గ, శివ, నాని, మండల నాయకులు పాల్గున్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ జంక్షన్‌లో శనివారం చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే గ్యాస్ బండ రూ. 500, వితంతు వృద్ధాప్య మహిళలకు పింఛన్ రూ. 4వేలు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణ ఆపడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తారని రైతులకు మూడు లక్షల రూపాయల వరకూ రుణాలు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అండ

జామి: సంక్షేమ పథకాలే రాష్ట్ర ప్రజలకు అండ అని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వృద్ధులకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్న దొర ఒఎస్‌డి బీల వాణిప్రసాద్ అన్నారు. తన తల్లి స్వర్గీయ లక్ష్మీ నారాయ ణమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం అట్టాడ బిఎన్ ఆశ్రమంలోని వృద్ధులకి వస్త్ర వితరణ చేశారు. ముందుగా తన తల్లిదండ్రుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందురావాలన్నారు. ప్రముఖ విద్యా సంస్థ త్రిసూల్ రమణ అధినేత విఎస్ఎన్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులకి సమయానికి భోజనం అందించడం గొప్ప విషయమని చివరి మజిలీలో వారు ప్రశాంత జీవనం కోరు కుంటారని అటువంటి ప్రశాంత వాతావరణం ఇక్కడ ఉందని అన్నారు. బుద్ధరాజు వర్మ, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపీ పాల్గొన్నారు.


వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

బొడ్డవరలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర పోలీస్ చెక్ పోస్ట్ వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ధర్మారావు ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందేకు నిత్యం తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో వివిధ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

14న ద్విచక్ర వాహనాలకు వేలం

ప్రజాశక్తి - గుర్ల

స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం పది గంటలకు ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేస్తామని ఎస్ఐ హరిబాబు నాయుడు శనివారం తెలిపారు. అక్రమంగా నాటు సారాను తరలిస్తుండగా ఎపి 35ఎఫ్ 5172 నెంబర్ గల పల్సర్ బైక్‌ను సిజ్ చేశామని ఆ బైక్‌ను వేలం వేస్తామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్ బెల్ట్ సభ్యులు, సత్యసాయి కన్వీనర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక స్వామివారి వీధిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర శనిరవారం గ్రీన్ బెల్ట్, సత్య సాయి భక్తులు సుమారు 100 మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సాయి భక్తులు ఒక్కక్క మొక్క నాటాలన్నారు. గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎస్‌వి.రమణమూర్తి మాట్లాడుతూ ఈ వేడికి కారణం మొక్కలు కొట్టివేయడమేనని మన ఇంటిచుట్టు మన రోడ్లు కిరువైపుల ఉన్నదాంట్లో మొక్కలు వేసి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ వైస్ ప్రెసిడెంట్ సత్యరాజు, వేణు, రమణ, అప్పలనాయుడు, లక్ష్మి నారాయణ, బాలవికాస్ ఉపాధ్యాయులు, ప్రతిభా భారతి, ప్రమీల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



మొక్కలు నాటుతున్న ప్రతినిధులు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌టిఒ హేమసుందర్, తదితరులు

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వీలుపర్తి క్లస్టర్‌లోని ఎఎస్‌పేట, వీలుపర్తి, కుమ్మపల్లి యూనిట్లలో ప్రకృతి వ్యవసాయ ఆర్‌టిఒ జి.హేమ సుందర్ ప్రకృతి వ్యవసాయ కాంప్లెక్స్ బ్లాక్‌లను పరిశీలించారు. వేపాడ, వీలుపర్తి, చిన్న గుడిపాల గ్రామాల్లో కాంపాక్ట్ బ్లాకుల్లో కేడర్స్ పనితీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాక్‌లో ఉన్న రైతులు అందరితో జీవామృతం తయారీ, వరిలో లైన్ షోయింగ్ గట్లపైన కూరగాయల మొక్కలు పెంపకం వంటివి పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గురించి వివరించి ఎక్కువ మంది రైతులతో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేసేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యంతో పాటు అధిక లాభాలు వస్తాయన్నారు. గ్రామాల్లో ఇప్పటికే చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారని అందరూ ఇదే పద్ధతిలో పంటలు పండించే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ రాము, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.